క్లుప్తంగా

నియామకం



మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శిగా మండల పరిధిలోని కొత్తగూడకు చెందిన సామ మహేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆయనకు నియామకపత్రం అందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కాగా కార్యదర్శిగా నియమితులైన మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కాకి దశరథ, భీమిడి జంగారెడ్డి, సామ సురేందర్‌రెడ్డి, సామ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కందుకూరు: రథ సప్తమిని పురస్కరించుకొని కందుకూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో భజన బృందం సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపునకు ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన జవహర్ యువజన సంఘం ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల మైదానంలోని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని జవహర్ యువజన సంఘం అధ్యక్షుడు సాతెల్లి నాగరాజు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల రెవెన్యూ అధికారి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. జవహర్ యూత్ క్లబ్ మైదానంలో అక్రమంగా నిర్మించిన గదిని తొలగించాలంటూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరిలో సంఘం సభ్యులు ముఖేశ్‌గౌడ్, నర్సింహ, ఆరుట్ల సురేష్, సిద్దు ముదిరాజ్, జైన్‌బాబు, సుదర్శన్, జంగయ్య, సురేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సరూర్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ చిత్రా లేఅవుట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ కమలానగర్, నేతాజీనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దాతల సాయంతో ప్రహరీ నిర్మాణం



ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ కౌన్సిలర్ యాదగిరి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని పోచమ్మ ఆలయానికి ప్రహరీ నిర్మించేందుకు రాజేంద్రనగర్‌కు చెందిన వేముల మల్లేశ్ ముందుకొచ్చారు. ఇందుకు సంబంధించిన పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఈ పనులను గ్రామ మాజీ కౌన్సిలర్ బుడుమాల యాదగిరి పర్యవేక్షిస్తున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండడంతో పాటు ఇతరాత్ర సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఈ ప్రహరీ నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహ, రామారావు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు చౌరస్తాలో పీఎస్ పక్కన నిర్మించిన మార్కెట్ సముదాయం



చిరు వ్యాపారులు విక్రయాలు చేపట్టేలా నిర్మించిన షెడ్లు

నిరుపయోగం.. మార్కెట్ సముదాయం

- వ్యాపారులకు షెడ్లు కేటాయించకపోవడంతో రోడ్లపైనే విక్రయాలు
- వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు

కందుకూరు: చిరు వ్యాపారులు కూరగాయలు, పండ్లు, పూలు విక్రయించేలా నిర్మించిన మార్కెట్ సముదాయం అధికారులు పట్టించుకోకపోవడంతో వృథాగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించినా ఇప్పటివరకు షెడ్లను చిరు వ్యాపారులకు కేటాయించలేదు. దీంతో రహదారుల వెంబడే కూర్చొని కూరగాయాలు, ఆకుకూరలు, పండ్లు ఇతరాత్ర సరుకులు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. మరోపక్క ప్రస్తుతం నిర్మించిన మార్కెట్ సముదాయం ప్రధాన రహదారికి కొద్దిగా దూరంగా ఉండటంతో కొనుగోలుదారులు రావడం లేదంటూ వ్యాపారులు అక్కడికి వెళ్లడానికి కొంత నిరాసక్తి చూపుతున్నారు. ఇది మండల కేంద్రంలోని మార్కెట్ సముదాయం పరిస్థితి.

రూ.29లక్షల నిధులతో..

కందుకూరు చౌరస్తాలో చిరు వ్యాపారులు రోడ్ల వెంబడి కూర్చొని కూరగాయలు, పండ్లు, పూల విక్రయాలు చేపడుతున్నారు. దీంతో కొనుగోలు చేయడానికి వచ్చినవారు వాహనాలు నిలపడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి సీడీపీ నిధులతో మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో మార్కెట్ సముదాయాన్ని రూ.29 లక్షల నిధులతో 33 మందికి సరిపడా షెడ్లు నిర్మించి పార్టీషన్ చేశారు.

16 నెలలు గడుస్తున్నా..

2023 సెప్టెంబర్ 23వ తేదీన అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆ మార్కెట్ సముదాయాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన తొలి రోజుల్లో కొద్దిరోజులు మాత్రమే కొందరు చిరు వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు విక్రయించారు. కాగా నిర్మించిన షెడ్లలో చేసిన పార్టీషన్స్‌కు నంబర్లు వేసినా ఇంతవరకు ఎవరికీ ఏ స్టాల్ తెలిపేలా కేటాయించలేదు. దీంతో మార్కెట్ సముదాయం ప్రారంభించి 16 నెలలు గడుస్తున్నా నిరుపయోగంగా మారింది. చిరు వ్యాపారులు పాత పద్ధతిలోనే రోడ్ల వెంబడి కూర్చొని విక్రయాలు చేపడుతున్నారు. మరోపక్క మార్కెట్ సముదాయం నిర్మించిన స్థలం శ్రీశైలం రహదారికి కొద్దిదూరంలో ఉండటంతో సరిగా గిరాకీ రావడంలేదనే సాకుతో చౌరస్తాకు చేరుకొని రోడ్లపైనే విక్రయాలు చేపట్టారు. దీంతో ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మార్కెట్ సముదాయం వృథాగా మారింది. ప్రస్తుతం ఆ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వ్యాపారులకు స్టాళ్లను కేటాయించి, రోడ్లపై విక్రయాలు చేపట్టకుండా చూడాలని, దీంతో వినియోగదారులు అక్కడికే వెళ్లి కొనుగోలు చేయాల్సి పరిస్థితి ఏర్పడుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

రోడ్లపై చిరు వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల విక్రయాలు చేపట్టడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. వారిని అక్కడి నుంచి మార్కెట్ సముదాయంలోకి తరలించడానికి చర్యలు తీసుకుంటాం. షెడ్లు కేటాయించి అక్కడే విక్రయాలు చేపట్టేలా చూస్తాం.

– ఎంపీడీఓ, సరిత, కందుకూరు

క్యాన్సర్ 250 రకాలు

- అవగాహన లేమితోనే పెరుగుతున్న బాధితులు
- క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఉదయ్ చవాన్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉదయ్ చవాన్

బడంగ్‌పేట్: క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడంతోనే రోగులు లక్షల్లో పెరుగుతున్నారని క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఉదయ్ చవాన్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బాలాపూర్‌లోని చవాన్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్‌లో 250కి పైగా రకాలున్నాయన్నారు. మొదటి దశలోనే గుర్తిస్తే వ్యాధిని జయించేందుకు ప్రస్తుతం అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మగవారితో పోలిస్తే మహిళలే ఎక్కువగా ఈ రోగం బారిన పడుతున్నారని వివరించారు. లంగ్ క్యాన్సర్, నోటి, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి ముఖద్వార క్యాన్సర్ ప్రమాదకరమైనవని స్పష్టంచేశారు. తమ ఆస్పత్రిలో పేద, మధ్యతరగతి ప్రజలకు అడ్వాన్స్‌డ్ క్యాన్సన్ సర్జరీ, కీమోథెరపీని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌చవాన్, డా.గాయత్రిచవాన్, డా.భాగ్యలక్ష్మీచవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలు రాజకీయాల్లో రాణించాలి



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

- కాంగ్రెస్‌పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జ్ కేఎల్లార్
- పార్టీలో పలువురి చేరిక

మీర్‌పేట: బీసీలు రాజకీయాల్లో రాణించేందుకు ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. మీర్‌పేటకు చెందిన పలువురు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం లెనిన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలు సత్తాచాటాలన్నారు. ఇందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించేలా ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసే విషయమై రాజకీయ ప్రతిపాదన, చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయి, మీర్‌పేట అధ్యక్షుడు కామోజి తిరుపతయ్య, కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, సామిడి గోపాల్‌రెడ్డి, జంపాల ప్రశాంత్, హన్మంత్, చంద్రశేఖర్, మధు, శేషు తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ దరఖాస్తుల స్వీకరణ

- నేటినుంచే ప్రక్రియ మొదలు
- కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి
- వార్డు కార్యాలయాల్లో సంప్రదించాలని సూచన



వార్డు కార్యాలయంలో అధికారితో సమావేశమైన కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం డివిజన్ వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తెలిపారు. మంగళవారం నుంచి ప్రతీ డివిజన్ వార్డు కార్యాలయాల్లో అప్లికేషన్లు తీసుకుంటారని, ఇందుకు సంబంధించిన ఫారాలు అందుబాటులో ఉంచాలని వార్డు ఆఫీస్ ఇన్‌చార్జి యాదగిరికి సూచించారు. పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల సాకారంలో భాగస్వాములు కావాలని కోరారు. దరఖాస్తు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా వెళ్లి అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

షాబాద్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామ సమీపంలోని చిన్న వాగు వంతెన పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్, నాయకులు ఉన్నారు.

మహేశ్వరం మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: మహేశ్వరం మండలంలోని జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలను నిర్ణయించామని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలను నిర్ణయించామని అవి నాగారం, గొల్లూరు, అమీర్‌పేట్, మాణిక్యమ్మగూడ, కల్వకోల్, దుబ్బచర్ల, కోళ్లపడకల్, మన్సాన్‌పల్లి, మహేశ్వరం-1, మహేశ్వరం-2, మహేశ్వరం-3, సిరిగిరిపురం, తుమ్మలూరు స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాలలో మొత్తం 43,362 మంది ఓటర్లు ఉన్నాయి. హర్షగూడ ఎంపీటీసీ స్థానంలో సిరిగిపురం ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా ఏర్పాటైన సిరిగిరిపురం ఎంపీటీసీ స్థానంపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ నవత, సూపరింటెండెంట్ పద్మశ్రీ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, ఇతర పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) మండపం వద్ద మంగళవారం ఆటో యూనియన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యుల సమక్షంలో యూని యన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పవన్, ఉపాధ్యక్షులుగా సంతోష్, శ్రీశైలం, ధనరాజ్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారిగా అల్లాడ శేఖర్, సహాయ కోశాధికారిగా సురేశ్, జాయింట్ సెక్రటరీలుగా సాయి, మహేశ్, సామ్రాట్, గౌరవ సలహాదారులుగా షేక్‌అయూబ్, శ్రీనివాస్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు భాస్కర్, విగ్నేశ్, సంతోష్, పాషా పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సప్తవాహన సేవలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. సప్తవాహన సేవలైన సూర్యప్రభవాహనం, హంసవాహనం, గజవాహన, హన్మంతవాహనం, శేషవాహన, సింహవాహన, గరుడ వాహన సేవలను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ అర్చకుడు వామానాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

సబితారెడ్డిపై విమర్శలు సరికాదు

- బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

బడంగ్‌పేట్: గడిచిన ఐదేళ్లలో వేల కోట్లు తీసుకొచ్చి అన్ని రంగాల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి అభివృద్ధి పనులు చేసిందని బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి కాంగ్రెస్ నాయకులపై ధ్వజమెత్తారు. మంగళవారం అల్మాస్‌గూడలో విలేకరుల సమావేశంలో రాంరెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ.. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో నేడు కార్పొరేషన్ సొంత భవనం, జిల్లా ఆధునిక లైబ్రరీ, క్రికెట్ గ్రౌండ్, ప్రజా భవన్, ప్రధాన రహదారుల విస్తరణ, అన్ని కాలనీల్లో సీసీ, బీటీరోడ్లు, వేల కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసిన ఘనత సబితారెడ్డికే దక్కుతుందన్నారు. 2007లో ఇక్కడి ప్రాంతాలను గ్రీన్ బెల్ట్ కింద మార్చారని, ఈ 15 ఏళ్లుగా మంత్రి హోదాలో రెసిడెన్షియల్ జోన్‌గా మార్చేందుకు సబితారెడ్డి పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. ఇటీవలనే మంత్రి శ్రీధర్‌బాబును కలిసి గ్రీన్‌జోన్‌ను ఎత్తివేయాలని వినతిపత్రం కూడా ఇచ్చిందన్నారు. గ్రీన్‌బెల్ట్ గురించి ఒక్క కాంగ్రెస్ నాయకుడైనా ఇప్పటివరకు వినతిపత్రం ఇచ్చారా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులు కబ్జాదారులని ఆరోపణలు చేస్తున్న నాయకులు ఎక్కడ కబ్జాలు చేశారో బయటకు తీయాలని సవాల్ విసిరారు. సబితారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తు ఊరుకోబోమని ఘాటుగా హెచ్చరించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ సబితారెడ్డితోనే అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, నాయకులు శ్రీపాల్‌రెడ్డి, రవి, ఎల్లారెడ్డి, ప్రదీప్, రామ్, రవితేజ, గణేశ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని కోళ్లపడకల్ గ్రామంలో గల శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడోరోజు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయంలో స్వామివారు, అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పలంకరణ, మహా పూర్ణాహుతి, రథోత్సవం, దేవత ఉద్వాసన, ఆశీర్వచనములు, భజన కార్యక్రమాలతో పాటు పలు పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో జరిపించారు. రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ, అండాలు దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవానికి పుస్తె, మెట్టెలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, డప్పు వాయిద్యాల మధ్య స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు హన్మగళ్ల చంద్రయ్య, నందిగామ యాదయ్య, నారాయణరెడ్డి, నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీ హరికిషన్‌గౌడ్, అన్నదాన ప్రభువులు దిద్దెల పెంచల్‌రెడ్డి, నీలమ్మ, ఇప్పలపల్లి ప్రభాకర్‌రెడ్డి, ప్రభావతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

‘లక్ష డప్పుల’ను విజయవంతం చేయండి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: ఎమ్మార్పీఎస్ చేపట్టనున్న ×లక్ష డప్పులు–వేల గొంతుకేల మహా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బండారు కరుణాకర్‌మాదిగ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కందుకూరు చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న సభకు ప్రతీ మాదిగ బిడ్డ హాజరై జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో మంద అంతయ్య, శ్రీను, రాములు, నవదీప్, క్రాంతికుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణం చేపట్టొద్దని వినతి



కమిషనర్ యోగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న వెంచర్ వాసులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని బొప్పన్న వెంచర్‌లో మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టొద్దంటూ మంగళవారం వెంచర్ వాసులు మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004లో బొప్పన్న వెంచర్ డీటీసీపీ అనుమతితో లేఅవుట్ అయ్యిందని, అయితే వెంచర్ ఏర్పాటు సమయంలో అంతర్గత మురుగునీరు అంతా పార్కు స్థలంలోనే అండర్ గ్రౌండ్ ట్యాంకులోకి వెళ్లేలా ప్లాన్ చేశారన్నారు. కానీ కొన్నిరోజుల క్రితం అమృత్ 2.0 పథకం కింద ఈ పార్కు స్థలంలోనే మంచినీటి ట్యాంకు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ప్రణాళికలు రూపొందించి, మంగళవారం పనులు ప్రారంభించారు. కానీ జేసీబీతో గుంతలు తీస్తుండగా.. లోపల నుంచి మురుగునీరు బయటకు వస్తుండడంతో వెంచర్‌వాసులు గమనించి పనులను అడ్డుకొని, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన సానుకూలంగా స్పందించి, ఒకటి, రెండు రోజుల్లో డీఈ, ఏఈలతో పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకుంటామని, అప్పటివరకు పనులను నిలిపివేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, వెంకట్‌చారి పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి పెట్టుబడి కోసం రైతు భరోసా ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. ఎన్నికల నినాదం కోసమే కాంగ్రెస్ పార్టీ నేతలు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను వాడున్నారన్నారు. షాద్‌నగర్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న చటాన్‌పల్లి రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని, త్వరలో ప్రత్యక్ష పోరాటం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, ఇస్నాతి శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, మఠం రుషికేశ్, సుధాకర్, ఎదిర రాజు, గణేశ్, నరేందర్‌రెడ్డి, కిషన్ నాయక్, మహేందర్‌రెడ్డి, రంగన్నగౌడ్, రాజునాయక్, ఆంజనేయులు, ఆకుల శ్రీను, రాజునాయక్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.